భక్తులందరినీ కాపాడతా..

● ఐదు పౌర్ణమి రోజులు కల్లుసాక పోయండి ● నల్లపోచమ్మ ఆలయంలో స్వర్ణలత భవిష్యవాణి



భవిష్యవాణి వినిపిస్తున్న స్వర్ణలత



ఊరమైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో రాములును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రసూల్‌పురా: భక్తులు భక్తిశ్రద్ధలతో నాకు బోనాలు, నైవేద్యం సమర్పించారు.అందరినీ కాపాడుతున్నా, ఐదు పౌర్ణమి రోజుల్లో కల్లుసాక పోయండి,. అంటూ భవిష్య వాణి స్వర్ణలత రసూల్‌పురా నల్లపోచమ్మ ఆలయంలో జరిగిన రంగం కార్యక్రమంలో పలికింది, ఆషాఢమాస బోనాల జాతరలో భాగంగా మంగళవారం పచ్చి కుండపై నిలబడి స్వర్ణలత రంగం కార్యక్రమం నిర్వహించారు. చండీహోమం, కుంభాభిషేకం ఘనంగా నిర్వహించాలని కోరారు. జాతర అలంకరణతో నేను చాలా సంతోషించాను. అందరినీ చల్లంగా చూస్తా అంటూ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రఘురామన్, అధ్యక్షుడు శ్యామ్, గోపాల్‌రాజు, శ్రీహరి, శేఖర్, గోవర్ధన్, గజేందర్, రమేష్ యాదవ్, రామరాజు, శ్యామ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫలహారబండ్ల ఊరేగింపులో ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా కట్టమైసమ్మ బస్తీ కట్టమైసమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారబండి ఊరేగింపు కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టిఎస్. శ్రీనివాస్, డి. శ్రీనివాస్, కుమార్, అంజనేయులు, మహేష్, దేవరాజ్, సంతోష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాటిగడ్డ ఊరమైసమ్మ అమ్మవారి బోనాలు..

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డలో కొలువుదీరిన ఊరమైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరంగారి రాములు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

అధికారుల కృషి అభినందనీయం

సికింద్రాబాద్: చిలకలగూడ కట్టమైసమ్మ దేవాలయంలో రెండు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగిన బోనాల వేడుకలను విజయవంతం చేయడంలో అధికారుల పాత్ర ఎనలేనిదని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో వేలాది మంది మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారన్నారు. మహిళలు, సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. బోనాల వేడుకల్లో కీలక ఘట్టమైన ఫలహారం బండ్ల ఊరేగింపులు ప్రశాంతంగా పూర్తి చేసిన ఉత్సవ నిర్వాహకులకు కార్పొరేటర్ ధన్యవాదాలు తెలిపారు. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీస్ అధికారులు, సిబ్బంది కృషిని ఆమె ప్రశంసించారు.

ప్రజలకు రక్షణగా ఉంటా

వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి

అమీర్‌పేట: బోనాల పండుగ వేడుకల్లో చివరి ఘట్టమైన రంగం కార్యక్రమం అమీర్‌పేట లక్ష్మీ దుర్గా సోనాబాయి దేవాలయంలో అంరంగ వైభవంగా జరిగింది. భక్తులతో ఆలయాల పరిసరాలు కిట కిటలాడాయి.భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ఘటాలను సమర్పించుకున్నారు. నర్సాపూర్ సమీపంలోని గుమ్మడిదలకు చెందిన మోహన్ పచ్చి కుండపై నిలుచుని భవిష్యవాణి వినిపించారు. 'గతంలో భక్తులు నన్ను మరిచిపోయారు.అందుకే ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అంతా బాగానే ఉంది, ప్రజలకు రక్షణగా ఉంటా, నన్ను భక్తితో కొలవండని, ఆలయాలను అభివృద్ధి చేయండి'ని సూచించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి, కరువు తీరుతుందన్నారు. అన్ని రంగాల్లో ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు నిరంజన్, సభ్యులు డి.క్రిష్ణ, గొలుసుల సత్యనారాయణ, క్రిష్ణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



వంజరి రిజర్వేషన్లను పునరుద్ధరించాలి



సమావేశంలో పాల్గొన్న వంజరి సంఘాల నేతలు

లాలాపేట: వంజరి సామాజిక వర్గానికి రిజర్వేషన్లను వెంటనే పునరుద్ధరించాలని వంజరి కుల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం తార్నాకలోని వంజరి భవన్‌లో 'వంజరి రిజ్వరేషన్లు–భవిష్యత్ కార్యాచరణ'పై గుర్తింపుపొందిన పలు వంజరి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి, తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షులు కాలేరు విశ్వనాథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శంకరన్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్టీ జాబితాలో ఉన్న వంజర్లను ఆనాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి రాత్రికి రాత్రే చీకటి జీఓ ద్వారా ఎస్టీ జాబితా నుంచి బీసీ(డీ) జాబితాలో చేర్చి తీరని అన్యాయం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం అన్ని గుర్తింపు పొందిన వంజరి సంఘాలతో భవిష్యత్ కార్యాచరణతో రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి గతంలో చెన్నారెడ్డి ఇచ్చిన జీవోను రద్దు చేసి తమను ఎస్టీలుగా గుర్తించాలన్నారు. సమావేశంలో వంజరి రిజర్వేషన్ కమిటీ ప్రతినిధులు ముజకరి రవీందర్, పోతనాకార్ సత్యనారాయణ,మహదేవ్ ముండే, కాలేరు రూపాసురేష్, వంజరి సేవా సంఘం ప్రతినిధులు ధాత్రిక ధర్మరాజు, ఎదుగని హరినాథ్, పిట్టల అంజయ్య, తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాత్రిక కాశీనాథ్, కాలేరు యుగంధర్, అనీల్, శ్రీనివాస్, విటల్, పలు జిల్లాల నుంచి వంజరి సంఘం నేతలు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

అడ్డగుట్ట: ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని డబుల్ బెడ్రూమ్ ఇళ్లను బినామీలకు రద్దు చేసి అర్హులైన వారికి కేటాయించాలని ఏసీయస్ నగర్ జాయింట్ యాక్షన్ కమటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం మారేడుపల్లి తహసీల్దార్ బీమయ్య గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్నారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు బినామీలకు ఇళ్లు కేటాయించారన్నారు. ఏసీఎస్ నగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై విచారణ జరిపించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో అర్జున్ రావు, సీహెచ్. అవిలయ్య, ఆర్. మల్లేష్, కే. శ్రీనివాస్, యాదగిరి, దశరథ, రాజ్‌కుమార్, ఈశ్వర్, రమేష్ ఉన్నారు.



బీమయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏసీఎస్ నగర్ జేఏసీ నేతలు

సీఎం సారూ.. కేసులు కొట్టి వేయించండి

సికింద్రాబాద్: ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలుగుదేశం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన కాలంలో తమపై నమోదైన కేసులు కొట్టివేయాలని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లో కోర్టులో హాజరైన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016లో తాము టీడీపీలో పని చేశామని, అప్పటి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయాలని రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు అప్పటి ఎక్సైజ్ మంత్రి పద్మారావు కార్యాలయం ఎదుట కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. ఈ ఘటనలో 15 మందిపై చిలకలగూడ పోలీసులు కేసులు నమోదు చేశారని చెప్పారు. అప్పటినుంచి కోర్టు చుట్టూ తిరుగుతున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా నమోదు చేయించిన కేసులను కొట్టివేయించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎంను కోరారు.



సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన బీజేపీ నాయకులు

ప్రొ.వీవీ బస్వరావుకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీ సీనియర్ అధ్యాపకులు ప్రొ.వీవీ బస్వరావు ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొ.వీసీ బస్వరావును సన్మానించి ఆయన విద్యార్థులకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.రమేష్‌కుమార్,ప్రొ.శ్రీనునాయక్,డా.రాజ్యం, డాక్టర్ భాస్కర్, డా.పరుశురామ్, డా.ఐలయ్య, డా.మోదం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చలో కలెక్టరేట్‌కు తరలిన ఓబీసీ మోర్చా నేతలు



చలో కలెక్టరేట్ కార్యక్రమానికి తరలివెళ్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నేతలు

సనత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ ఓబీసీ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఓబీసీ మోర్చా సనత్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ కన్నూరి చంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా నేతలు మాట్లాడుతూ బీసీలకు కేటాయిస్తామన్న రూ.20 వేల కోట్ల హామీ అమలుకు నోచుకోలేదన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీ, కామారెడ్డి కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ హామీల అమలు ఊసే లేదన్నారు. మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ, చేతి వృత్తులకు సాయం, ప్రతి మండలంలో నవోదయ విద్యాలయాలు, బీసీలకు గురుకులం, డిగ్రీ కళాశాల, బీసీ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు, అన్ని జిల్లాల్లో రూ.50 కోట్లతో స్టడీ సర్కిల్ లైబ్రరీ భవనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌గౌడ్, చీర శ్రీకాంత్, శ్రీనివాస్‌యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, దయానంద్, శ్రీశైలంగౌడ్, విజయ్‌కుమార్, సునీల్‌కుమార్, యేచెన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా రూ.33, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 53, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 21, దోసకాయ 15, బీట్‌రూట్ 32, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 40, చామగడ్డ 40, మొరంగడ్డ 55, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నియామకం



నియామక పత్రాలు అందుకుంటున్న సందీప్ శర్మ, రాఘవేంద్ర శర్మ

లాలాపేట: బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భువనగిరి సందీప్ శర్మ, సంయుక్త కార్యదర్శిగా రాఘవేంద్ర శర్మ నియమితులయ్యారు. ఇటీవల లాలాపేటలో బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి సమక్షంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ శర్మను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా రాఘవేంద్ర శర్మనియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు ప్రకటించారు. సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా వారు నియామక పత్రాన్ని అందుకున్నారు.

నేడు సికింద్రాబాద్ పైలాన్‌కు క్షీరాభిషేకం



సికింద్రాబాద్ పైలాన్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బుద్ధభవన్ సమీపంలోని సికింద్రాబాద్ పైలాన్‌కు బుధవారం పాలాభిషేకం చేయనున్నట్లు లష్కర్ జిల్లా సాధన సమితి ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు మంగళవారం సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్ గౌడ్ ఓ ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్ నగరం ఏర్పడి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2006లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సికింద్రాబాద్‌లో పైలాన్ ప్రారంభించారని, ఈ సందర్భంగా ఆయన రూ. సికింద్రాబాద్ అభివృద్ధికి రూ.200 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారని పవన్‌కుమార్ గౌడ్ గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఆ స్థాయిలో నిధుల కేటాయింపు జరగలేదని లష్కర్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. నేడు రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం లష్కర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. పాలాభిషేకం ద్వారా లష్కర్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గౌతంనగర్: పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మనోహర్‌రెడ్డి, ప్రముఖ సైకాలజిస్ట్, గంప నాగేశ్వరరావులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ యాప్రాల్ మాతృశక్తి ఆధ్వర్యంలో యమునా పాఠక్ నేతృత్వంలో మంగళవారం బిహారి బస్తీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీ, వైద్య నిపుణులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ వంశీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిల సంయుక్తాధ్వర్యంలో సుమారు 120 మందికి షుగర్, బీపీ, దంత పరీక్షలతో పాటు మహిళలకు గైనిక్ పరీక్షలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు విశ్వేశ్వరావు, బొప్ప అధ్యక్షులు సుశీల్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ తెలంగాణ ప్రభుత్వం, డాక్టర్ సుధాకర్, విజయారి, రవి, రాఘవేంద్రరావు, విజయలక్ష్మి, భవాని, కాంతారావు, శంకర్, హరిహర సుబ్రహ్మణ్యం, అశోక్‌స్వేన్, పవన్, వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలతో కలిసి చిన్నారులు సందడి చేశారు. వారితో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్య పట్ల ఏ విధంగా వ్యవహరించాలో ఉపాధ్యాయులు చిన్నారులకు సూచించారు. ఈ వేడుకలకు హాజరైన స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యులు హెచ్ఎస్ త్రిపాఠి, సూర్యనారాయణ , ప్రిన్సిపాల్ రాధిక మాట్లాడుతూ చిన్నతనం నుంచే పెద్దవారి పట్ల గౌరవ మర్యాదలు, క్రమశిక్షణ అలవర్చడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. పిల్లలకు వారి అమ్మమ్మలు, నాన్నమ్మ, తాతయ్యల మధ్య మరింత బంధం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ స్ఫూర్తిదాయకం

సనత్‌నగర్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అసాధారణ ప్రతిభను కనబరుస్తూ స్ఫూర్తిగా నిలవడం గర్వకారణమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన బేగంపేట ఓల్డ్‌పాటిగడ్డలోని బండిమెట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సీహెచ్.విజయ్‌కుమార్‌ను ఆమె అభినందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వినయ్‌కుమార్‌కు మెమెంటోను అందజేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందిస్తున్నాయనడానికి విజయ్ సాధించిన ఘనతే నిదర్శనమన్నారు. ఇంతటి విజయానికి కారణమైన ప్రభుత్వ పాఠశాల బోధన సిబ్బంది కృషి ఇతర పాఠశాలలకు ఆదర్శనీయమన్నారు. వినయ్‌కుమార్‌ను ప్రేరణగా తీసుకుని విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను చాటాలని సూచించారు. తద్వారా తాము చదువుకున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన వారవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు సీఎల్ కృష్ణ, నజీర్ అడ్డు, తస్లీమ్‌షేగం, బబ్లు, నవాజ్, మునీర్, సబా, అక్బర్, అల్తామస్, స్వరూప, జగదీష్, సాయిబాబా, అజ్మత్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.



వినయ్‌కుమార్‌ను అభినందిస్తున్న కోట నీలిమ

నేడు సనత్‌నగర్ గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

సనత్‌నగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు సెక్రటరీ జేఎస్‌టీ శాయి ఓ ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్ బ్రాంచ్ లైబ్రరీ సహకారంతో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్ సమీపంలోని గ్రంథాలయంలో వ్యాసరచన, వక్తృత్వ, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సనత్‌నగర్, ఎస్ఆర్‌నగర్ ప్రాంతాల్లోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలు సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరికాదని ఓయూ విద్యార్థి నాయకులు అన్నారు. మంత్రి సీతక్క పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అనుచితమని ఓయూ జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ అన్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు నల్గొండ అంజి ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట చేపట్టిన దిష్టిబొమ్మను దహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించి శాసనాలు చేసే చట్టసభల్లో వ్యక్తిగత దూషణలను ప్రజలు హర్షించరని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు..

సనత్‌నగర్: సీడబ్ల్యూసీ సభ్యుడు, ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరాకు హైదరాబాద్ క్లబ్ క్రికెటర్ బెంజమిన్ దబ్బెట మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్‌ఖేరా పేరిట రూపొందించిన జెర్సీని ఆయనకు బహుకరించారు. భవిష్యత్తులో పవన్‌ఖేరా సలహాలు, సూచనలతో కాంగ్రెస్ పార్టీ మరిన్ని విజయాలను నమోదు చేయాలని బెంజమన్ ఆకాంక్షించారు.



పవన్‌ఖేరాకు జెర్సీ అందజేస్తున్న బెంజమిన్

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్పీ) నిజాం కాలేజీ అధ్యక్షుడిగా ధార సతీష్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌కుమార్‌యాదవ్ మంగళవారం తెలిపారు. విద్యారంగంతో పాటు విద్యార్థుల సమస్యల పై పోరాడేందుకు నిజాం కాలేజీతో అన్ని కాలేజీలకు కమిటీలను వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓయూ అధ్యక్షులు మధుయాదవ్, టీఎస్పీ నాయకులు సూర్య, మహేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



వీరాంజనేయస్వామిని దర్శించుకున్న మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు

సికింద్రాబాద్: మున్నూరుకాపు సంఘం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన సత్రం ధర్మకర్తలు, మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ధర్మకర్తలు మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని శ్రీవీరాంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఇటీవల ఆలయ ధర్మకర్తగా బాధ్యతలు స్వీకకరించిన మున్నూరుకాపు సంఘం నాయకుడు కైలాష్ అరుణ్‌కుమార్‌ను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గంపా చంద్రమోహన్, పోతాని నరసింహారావు, ప్యాట రవీందర్, గోపాల రాధాకృష్ణ, రాకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల భద్రతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాల్

కంటోన్మెంట్: సీనియర్ సిటిజన్ల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాల్ అన్నారు. మంగళవారం ఆమె నార్త్ జోన్ పరిధిలోని 11 పోలీస్ స్టేషన్ల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో పౌరుల భాగస్వామ్యంపై పలు సూచనలు చేశారు. నార్త్ జోన్ పరిధిలో సీనియర్ సిటిజన్లు అధిక సంఖ్యలో ఉన్నందున వారి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సీసీ కెమెరాలు, వీధి దీపాలు, రోడ్లపై వాహనాల అక్రమ పార్కింగ్, ర్యాష్ డ్రైవింగ్, వీధి కుక్కలు, నివాసాల సమీపంలో చెత్త డంపింగ్, అనుమానాస్పద స్థితిలో దిమ్మరుల సంచారం, వీధి వ్యాపారుల రోడ్ల ఆక్రమణలు తదితర సమస్యలపై సమీక్షించారు. చట్ట ప్రకారం ఆయా సమస్యలపై తగిన చర్యలు తీసుకుంటామని డీసీపీ వారికి హామీ ఇచ్చారు. ఇకపై కాలనీ సంక్షేమ సంఘాల సమన్వయం పెరిగేలా పోలీసు అధికారులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

రసూల్‌పురా: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అరుణ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ తల్లి రాజ్యలక్ష్మి (63) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం తెల్లవారుజామున ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో ఉన్న చెట్టుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.